
# అదీ సంగతి..!



'సుప్రభాతం' మాసపత్రిక . . . అక్టోబర్' 2004

వడివడిగా నడుస్తున్నారు అందరూ.

ఉన్న అరడజను ఆడవాళ్ళయితే మరీనూ! 'ఆంధ్ర మహిళలకు దైవభక్తి జాస్తి' అని ఎవరన్నారోగాని వాళ్ళని చూస్తే 'నిజమే సుమా!' అన్పిస్తోంది. వడివడిగా అడుగులు పడుతున్నాయి.

"ఉండండ్రా! ఎంత పడుచు ప్రతినిధులైతే మటుకు ఇంత పరుగు నడకా?!" ఉన్నవాళ్ళలో నడవలేక, ఒంటి బరువును మోయలేక అపసోపాలు పడుతున్న అలిపిరి అంకాయమ్మ కేకలేస్తోంది.

ఎవరూ వినిపించుకోవడం లేదు.

"పడుచుదనం పరవళ్ళు త్రొక్కుతూ పరుగులు దీస్తోంది!" వెనుకనుండి కారుకూతలో, బస్సుకూతలో... ఏవో కూతలు కూస్తున్నాడు బంగారుబాబు.

"సర్లేవోయ్! దేవుడి దగ్గరకొచ్చినా పరవళ్ళ పాటలు మానలేదు. గుడి మూసేసే టైమైంది!" ఒకింత ఆత్రుతగా అంటోంది- ఆరో వార్డు మెంబరు అనంతలక్ష్మి. సైగలయ్య ఆమె మాటకు 'సై... సై...' అన్నాడు. అతను 'ఆడదాని రేవు' పంచాయితీకి పద్దెనిమిదో వార్డు మెంబరు.

అతనికి మాటలు తక్కువ- సైగలు ఎక్కువ! అందుకే ఆ పేరుతో ఫిక్స్ చేయబడ్డాడు. సైగలతోనే తన వార్డు ఓటర్లని బోల్తా కొట్టించి, ఓట్లని బ్యాలెట్ బాక్స్‌లో వేయించుకోగలిగాడు... ప్రత్యర్థిని దెబ్బతీయగలిగాడు.

"గుడి మూసే టైమయింది!" అనంతలక్ష్మి అరిచింది.

'అందరిదీ ఒకే నడక, మాట, అడుగు' అన్నట్లు- ఒకరిని ఒకరు ఫాలో అవుతూ ముందుకు కదిలిపోతున్నారు.

నల్లబోతు నాంచారయ్యకు చాలా ఆనందంగా, సంతృప్తిగా ఉంది. 'లేకపోతే ఆ పెంచలయ్య తన మీదకే ఎదురుదాడికి దిగుతాడా? తన ప్రెసిడెంట్ గిరీని ఊడబెరకడానికి ప్రయత్నిస్తాడా?!' తలచుకుంటే ఒళ్ళు మండిపోతోంది నాంచారయ్యకి. 'నాంచారయ్యా? మజాకా?' తనలో తానే అనుకున్నాడు కసిగా.

అసలు 'ఆడదాని రేవు' పంచాయితీకి ఆశాజ్యోతి తను. తనే ఊరికి రారాజు! ఆనాడు తన ఆగడాలకు మెచ్చుకుని అధిష్ఠానం పిల్చి టిక్కెట్ ఇచ్చింది. రాష్ట్రంలో ఏ పంచాయితీకి లేనివిధంగా ఓటుకు ఐదువందలు ఇచ్చి కొనుగోలు చేశాడు. ఏరు ఎండి, నీళ్లు లేక, బీటలు తీసిన ఊరులో బీరును ఏరులై పారించాడు. రిగ్గింగ్ యథేచ్ఛగా చేసి, మరోమారు 'నాంచారయ్యా? మజాకా?' అన్పించుకున్నాడు.

'అటువంటి తనపై పెంచలయ్య వర్గం అవిశ్వాసం పెడుతుందా? చెప్తాను... నాంచారయ్యకు ఎదురులేదని నిరూపించుకుంటాను...' ఆలోచనలతో ఊగిపోతున్నాడు నాంచారయ్య.

'ప్రెసిడెంట్‌గారూ... పాతికమందికి పాతిక కొబ్బరికాయలు, పూలదండలు!" విక్టరీ విల్సన్‌బాబు పిలుపు నందుకుని పర్సుకోసం జేబులో చేయి పెట్టాడు.

విల్సన్‌బాబు చిన్నతనం నుండి 'ఆడదాని రేవు' గ్రామంలోని కల్లు సంఘం, సారాసంఘం మొదలుకొని నీటి సంఘంలోనూ సభ్యుడు. పోటీ చేసిన ప్రతిసారీ ఓటమి లేక విజయం సాధించాడు. దానితో విల్సన్‌బాబు పేరుకు ముందు 'విక్టరీ' సార్థక నామధేయమైపోయింది. మొదటిసారి వార్డుమెంబరుగా నెగ్గినప్పుడు ఎం.ఎల్.ఏ. అయినంత సంబరపడిపోయాడు విక్టరీ విల్సన్‌బాబు.

అతను నాంచారయ్యకు ముఖ్య అనుచరుడు కావడంతో వైస్ ప్రెసిడెంట్ దాకా ఎదిగిపోయాడు. ఊరులో ఉన్నప్పుడు కులమంటూ, మతమంటూ తన్నుకుచచ్చిన వారంతా ఇలా తమిళదేశం టూర్‌కి రాగానే భక్తిలో పడిపోయారు. నాంచారయ్య పాతికమంది సేన 'చిదంబరం' గుళ్ళో కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకుని బయటకు వచ్చారు.

ఒక్కసారి లెక్క సరిచూసుకున్నాడు... 'తనతో కలిసి ఇరవై ఆరు ఉన్నారా, లేదా?' అని! ఉన్నందుకు హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు నాంచారయ్య.

మధుర మీనాక్షి వైపుకు మినీబస్సు కదులుతోంది!

ఆడ మెంబర్లు తమిళదేశంలోని ముచ్చట్లను ముచ్చటించుకుంటున్నారు. మగ మెంబర్లయితే నాంచారయ్య, నాంచారయ్య మీద ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఎదుర్కోవాలో చర్చించుకుంటున్నారు.

ముందు సింగిల్‌సీట్లో కూర్చున్న నాంచారయ్య ఆలోచనలో పడ్డాడు. చేతివాచీలోకి చూశాడు. పదో తారీఖుకి గడువు ఇంకా మూడురోజులు ఉంది. తొమ్మిది రాత్రికి 'ఆడదాని రేవు'కి చేరితే సరి! సెల్‌ఫోన్‌లో అక్కడి తన మనుషులతో మాట్లాడాడు. తమకు అపోజిషన్‌లో ఉన్న వార్డుమెంబర్సు ఐదుగురిని రేటు ఎంతయినా సరే- కొనెయ్యమని ఆదేశాలు ఇచ్చాడు.

అసలు... రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందని నాంచారయ్య ఊహించలేదు. తమ పార్టీ ఊహకందకుండా పడిపోయింది. 'అది పోతే ఏమిలే... తన పదవి పదిలమే కదా!' అని సంతృప్తి చెందాడు. కాని, రాష్ట్రాన్ని ముంచేసిన ఉప్పెన గ్రామాలను కూడా ముట్టడి చేస్తుందని ఊహించలేకపోయాడు మొదట్లో.

నెగ్గిన పార్టీ కాళ్లు కుదురుగా ఉంటాయా?! ఎక్కడ అపోజిషన్ ఉంటే అక్కడ 'మీరు కాదంటూ' ప్రత్యక్షమవుతున్నారు. కావాలని అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నారు. రెండో వార్డుమెంబరు శవాల సన్యాసిరాజు సలహాలు ఈయడంలో దిట్ట!

'ప్రెసిడెంటయ్యా! వాళ్ళు మనమీద అవిశ్వాస తీర్మానం పెట్టడమేమిటి? మనమీద మనమే పెట్టుకుని వీగిపోయేటట్లు చేస్తే ఏ గొడవా ఉండదు. మరో రెండున్నర సంవత్సరాలు 'ఆడదాని రేవు' పంచాయితీకి నల్లబోతు బాబుగారే ప్రెసిడెంటు. మేమే వార్డుమెంబర్లం!" మీసం మెలేస్తూ అన్నాడు- చట్టాన్ని చదివి నమిలేసిన వాడిలా ఫోజు పెట్టి.

ఏడో వార్డుమెంబరు గిత్తల గిరిజ అతనికి వత్తాసు పలికింది. కాలేజీలో చదువుతున్నప్పుడు తన సీనియర్ 'లా' స్టూడెంట్ సిరాజ్‌తో ప్రేమలో పడింది గిరిజ. దానితో ఆమె 'లా' కోర్సుని డిస్కంటిన్యూ చేసేసింది. అయినా చట్టం తనకు తెలుసునన్న విశ్వాసం తొణికిసలాడుతోంది ఆమె మాటల్లో.

తమ అధికార ప్రతినిధి మరో వార్డుమెంబరు శివంగుల శాంతమూర్తి కూడా ఇది బాగానే ఉందని చెప్పడంతో తమ పార్టీవారి చేతనే తను అవిశ్వాస తీర్మానాన్ని పెట్టించుకునేందుకు సిద్ధమయ్యాడు నాంచారయ్య.

'రాజకీయ సంక్షోభం... అవిశ్వాస తీర్మానం' అనగానే 'గ్రూపు శిబిరం' తప్పదుగా!

"ప్రెసిడెంట్‌గారూ! ఈసారి శిబిరంలో మునపటిలా గాక, ఫారిన్ సరుకు తెప్పించాలి!" అన్నాడు విక్టరీ విల్సన్‌బాబు- ఎంతో ఆశగా ఫేసు పెట్టి.

"లేకపోతే- హైదరాబాదు వైస్రాయ్‌ని తలదన్నే మరో హోటల్‌ని చూడమన్నారా?! సిటీ నాకు బాగా తెలుసు!" మరో వార్డుమెంబరు కాడెద్దుల కనకలింగం ముందుకొచ్చాడు.

డబ్బు వర్షంలా కురిపించగలిగినా వారి మాటలు రుచించలేదు నాంచారయ్యకి.

తన విలేజ్ క్యాబినెట్ మహిళా మెంబర్లు ఎక్కువగానే ఉన్నారు. ఫారిన్ సరుకు శిబిరాలు, వైస్రాయ్ సమావేశాలు నిర్వహిస్తే వికటించి మొదటికే మోసం రావచ్చు. అందులోనూ ప్రత్యర్థి పల్లపోతు పెంచలయ్య కత్తులు దూస్తున్నాడు. తన విజయానికి ఢోకా లేకపోయినా తన జాగ్రత్తలో తనుండడం మంచిది.

"నాకు ఎప్పటినుంచో శ్రీరంగం మొక్కు ఉంది. మా ఆయన నన్ను వదిలి వెళ్లిపోయినప్పుడు మొక్కుకున్నాను. ఆయన తిరిగిరాలేదు గాని, మొక్కు మాత్రం ఉండిపోయింది!" వనమూలికల వకుళ అంది వయ్యారాలు ఒలకబోస్తూ.

చక్కటి ఐడియా వచ్చింది నాంచారయ్యకు! ఈరోజుల్లో ఎక్కడికో తీసుకుపోయి రాజకీయ శిబిరాలు నిర్వహిస్తే... అపోజిషన్ వాళ్ళు గెద్దల్లా వాలి, కాకుల్ని తన్నుకుపోతున్నారు. దీనికితోడు రిస్కూ... ప్రజలలో చులకన అయిపోవడం!

అందుచేత ఎవరికీ అంతుచిక్కకుండా తీర్థయాత్రలకని మొత్తం పాతికమంది మెంబర్సుని ఎక్కించుకొని పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోతే... పుణ్యానికి పుణ్యం, చూసేవాళ్ళకి గౌరవం! ప్రత్యర్థులకు దూరంగానూ ఉండొచ్చు.

ఒకచోట నుండి మరోచోటికి మారుతూ ఉండటంవల్ల జాడ కూడా అంత సులభంగా తెలుసుకునే వీలుండదు. ఆ కారణం చేతనే ఒకరిద్దరి దగ్గరున్న సెల్‌ఫోన్స్ కూడా తీయించేశాడు.

మొత్తానికి ఐడియా బ్రహ్మాండంగా పారింది. మొబైల్ శిబిరంలో మహిళా మెంబర్సు ఉత్సాహమే ఉత్సాహం! కులమతాల కతీతంగా అందరూ ఎంజాయ్ చేశారు.

మీటింగ్ రోజు ఉదయానికి తమ ఇళ్లకు చేరుకున్నారందరూ.

●

బల పరీక్ష పంచాయితీ అధికారుల సమక్షంలో జరిగిపోయింది!

తలపట్టుకు కూర్చున్నాడు నాంచారయ్య. ఓటింగ్‌లో తనకు అనుకూలంగా ఐదు వస్తే- ప్రతికూలంగా పాతిక వచ్చాయి. శాశ్వతమనుకున్న పదవికి రెక్కలు రావడంతో పేరుకు ముందు 'మాజీ' అనే పదం వచ్చి చేరిపోయింది. అంటే... తనతో తీర్థయాత్రలకు తిరిగిన తనవాళ్ళంతా అటు... ఒళ్ళు కంపించిపోతోంది!

'నల్లబోతు నాంచారయ్యా..? మజాకా!' అని తనలో తాను గతంలో ఎన్నోసార్లు అనుకున్నాడు. ఇప్పుడూ అనుకుంటూనే ఉన్నాడు.

కానీ, ఈసారి అనుకోవడంలో ఏదో వెఱ్ఱితనం, పిచ్చితనం కన్పిస్తోంది.

'సుప్రభాతం' ... అక్టోబర్' 2004